## క్లుప్తంగా

### ఘనంగా గంగమ్మ తల్లి పండగ



అమ్మవారి గద్దె వద్ద నిర్వహించిన పూజల్లో నాయకులతో కలిసి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో యాదవులు గంగమ్మ తల్లి(గావు) పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేకు యాదవ కులస్తులు తప్పెట గుళ్లతో స్వాగతం పలికారు. స్థానికుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, నాయకులు గెద్ద దాలినాయుడు, వెంకటరమణ ఫణీంద్రుడు, చిరంజీవి, మురళీ, సత్యనారాయణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

### సెంటర్ లైటింగ్ పునరుద్ధరణ



సెంటర్ లైటింగ్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో ఆంజనేయపురంలో సెంటర్ లైటింగ్ పునరుద్ధరణ పనులను మేజర్ పంచాయతీ విద్యుత్ సిబ్బంది శనివారం చేపట్టారు. మెయిన్‌రోడ్‌లో సిటీకేబుల్ కార్యాలయం వద్ద ప్రారంభమయ్యే డివైడర్‌లో సెంటర్ లైటింగ్ పోల్‌ను రెండు రోజుల క్రితం కారు ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయింది. విరిగిపోయిన స్తంభం స్థానంలో మేజర్ పంచాయతీ విద్యుత్ సిబ్బంది కొత్తది ఏర్పాటు చేయడంతో పాటు లైట్లను అమర్చారు.

### చలివేంద్రాల ప్రారంభం



గుర్ల పెట్రోల్ బంక్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గుర్ల: వేసవి నేపథ్యంలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు మండలంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి పెంటోజిరావు తెలిపారు. మండల కేంద్రంలోని మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎంపీడీఓ శేషుబాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నారాయణమ్మతో కలిసి శనివారం ప్రారంభించారు. ఆర్‌ఐలు అప్పల రాజు, దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్, చందక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల పోరుబాట రేపు



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు అప్పారావు

దత్తిరాజేరు: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 31న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు కె.అప్పారావు,పి.రాంప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని కోమటిపల్లిలో ఉపాధ్యాయులతో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ కమిటీ వేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల సాధనకై నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి ఉపాధ్యాయులు అంతా హాజరు కావాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు చంద్రరావు, రమేష్, హరేష్, ధనుంజయరావు, చంద్రశేఖర్, వెంకటరావు పాల్గొన్నారు.

### మండల పరిషత్ నిధులతో బోరు ఏర్పాటు



పూజలు చేసి బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురంలోని జంగాల కాలనీలో మండల పరిషత్ నిధులతో తాగునీటి బోరు, ట్యాంకు నిర్మాణ పనులకు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి శనివారం భూమి పూజ చేశారు. స్థానిక సర్పంచ్ పొంద్రంకి కామేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఎస్.ఆదినారాయణ, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రతిపాదనలకే పరిమితం..!

- మరమ్మతులకు నోచుకోని మార్లాపల్లి చానెల్ సిస్టమ్
- 2018లో చానెల్ ఆధునికీకరణకు రూ.6.20 కోట్లతో ప్రతిపాదనలు
- తట్టమట్టి కూడా తీయని వైనం
- తాజాగా రూ.3 కోట్లతో ప్రతిపాదనలు
- ఈసారైనా పనులు పూర్తయ్యేనా అని ఎదురు చూస్తున్న రైతులు



పాడైన మార్లాపల్లి చానెల్ సిస్టమ్ తలుపులు



శిథిలావస్థకు చేరుకున్న చానెల్ సిస్టమ్ గట్టు



ప్రధాన కాలువలో తుప్పలు, చెట్లు

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గంలోనే అతిపెద్దదైన ఎల్.కోట మండలంలోని మార్లాపల్లి సాగునీటి చానెల్ సిస్టమ్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. సాగునీటి చానెల్ సిస్టమ్ మరమ్మతులకు అధికారులు పదేపదే ప్రతిపాదనలు చేయడమే మిగులుతోంది తప్ప పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. సుమారు 43 ఏళ్ల క్రితం కోటవాని చెరువు గెడ్డపై నిర్మించిన ఈ చానెల్ సిస్టమ్ ద్వారా ఏడు గ్రామాల్లోని సుమారు 1,500 ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందేది. అయితే కొన్నేళ్లుగా సాగునీటి చానెల్ సిస్టమ్ నిర్వహణ సరిగా చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈచానెల్ సిస్టమ్ ఆధునికీకరణకు 2018లో టీడీపీ ప్రభుత్వంలో అధికారులు రూ.6.20 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. 2019లో ఎన్నికలు ఉండడంతో అప్పటిలో నియోజకవర్గ టీడీ పీ నాయకులు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేసిందని, పనులు పూర్తి చేసేస్తామని తెగప్రచారం చేసుకున్నారు.తీరా చూస్తే తట్టెడు మట్టి కూడా తియ్యలేదు. సాగునీటి చానెల్ సిస్టమ్ నుంచి మరమ్మతులకు నోచుకోలేదు. తాజాగా మరోమారు రూ.3 కోట్లతో ఆధునికీకరణ పనులకు అధికారులు ప్రతిపాదనలు చేశారు.

### పూర్తి చేస్తే 1,500 ఎకరాలు సస్యశ్యామలం

మార్లాపల్లి సాగునీటి చానెల్ సిస్టమ్ మరమ్మతులు పూర్తి చేస్తే సుమారు 1,500 ఎకరాలు సస్యశ్యామలమవుతాయి. చానెల్ సిస్టమ్ నుంచి సాగునీటిని విడిచిపెట్టి ఏడు గ్రామాల్లోని చెరువులను నింపేవారు. సుమారు 7 కిలోమీటర్ల మేర కాలువ ద్వారా నీరు ప్రవహించి చెరువులను చేరుకునేది. శ్రీరాంపురం గ్రామ కోటవానిచెరువు కింద 102.86 ఎకరాలు, రెల్లిగౌరమ్మపేట గ్రామంలోని పెద్దగెడ్డ చెరువు కింద 215.23 ఎకరాలు, రంగాపురం గ్రామానికి చెందిన వెంకయ్యబంద కింద 21.03 ఎకరాలు, గూనవాని చెరువు కింద 64.88 ఎకరాలు, రాజు చెరువు కింద 84.51 ఎకరాలు, కూర్మవరం గ్రామంలోని అమ్మ చెరువు కింద 188.46 ఎకరాలు, తలారి గ్రామానికి చెందిన రాయప్ప చెరువు కింద 153.36 ఎకరాలు ఈ చానెల్ సిస్టమ్ పరిధిలోకి వస్తాయి. గత కొన్నేళ్లుగా చానెల్ సిస్టమ్ పూర్తిగా దెబ్బతినడం, కాలువలో పూడిక పేరుకుపోవడంతో చెరువులకు పూర్తిస్థాయిలో సాగునీరు చేరడం లేదు.

### నీరు చెట్టు పేరుతో దోపిడీ

2017లో కాలువల్లో పూడికలతీతకు ప్రభుత్వం నీరు–చెట్టు కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షలు మంజూరు చేయగా తూతూ మంత్రంగా పనులు చేపట్టి అప్పటి అధికార టీడీపీ నాయకులు నిధులు స్వాహా చేసేశారు. అంతకుముందు 2014–15, 2015–16 ఆర్థిక సంవత్సరాల్లో నూ చానెల్ గట్టు, కాలువ మరమ్మతులకు సుమారు రూ.48లక్షలు మంజూరు చేశారు. అప్పుడు కూడా మొక్కుబడిగా పనులు చేసి బిల్లులు డ్రా చేసుకున్నారనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఈసారైనా పనులు పూర్తి చేస్తారా లేదా అన్న సందేహాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

### అంచనాలు సిద్ధం చేశాం

చానెల్ సిస్టమ్ ఆధునికీకరణకు 2018లో నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో అప్పటిలో ఆ పనులు రద్దయ్యాయి. ప్రస్తుతం చానెల్ సిస్టమ్ పరిధిలో రూ.10 లక్షలతో తాత్కాలిక పనులకు, రూ.3 కోట్లతో శాశ్వత పనులకు అంచనాలు రూపొందించాం. నిధులు మంజూరైతే 8 అక్విడెక్ట్‌లు, 2 కల్వర్టుల నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపడతాం.

– డీఈ శ్రీచరణ్, జలవనరుల శాఖ

### ప్రచారమే తప్ప పనులు జరగడం లేదు



సాగునీటి చానెల్ సిస్టమ్ మరమ్మతులకు నిధులు మంజూరు చేసేశామని టీడీపీ నాయకులు గతంలో తెగ ప్రచారం చేసుకున్నారు. పనులు మాత్రం చేలేదు. నీరు చెట్టు కార్యక్రమంలో భాగంగా పనుల పేరుతో టీడీపీ నాయకులు సుమారు రూ.10 లక్షలు దోచుకున్నారు. ఇప్పుడు రూ.3 కోట్లతో పనులకు ప్రతిపాదనలు చేశామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, పనులను పూర్తి చేసేలా చూడాలి.

– పినిశెట్టి కిష్టప్పదొర, రైతు, రెల్లిగౌరమ్మపేట

# చీపురుపల్లిలో డీఎస్పీ కార్యాలయం

- ఇంతవరకు గరివిడిలో ఉన్న కార్యాలయం
- కొద్ది రోజుల క్రితమే చీపురుపల్లికి మార్చిన అధికారులు



చీపురుపల్లిలోని వెంకటేశ్వరనగర్‌లో డీఎస్పీ కార్యాలయం

చీపురుపల్లి: సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(డీఎస్పీ) కార్యాలయం చీపురుపల్లికి చేరింది. సబ్ డివిజన్ హెడ్‌క్వార్టర్‌గా ఉన్న చీపురుపల్లిలోనే డీఎస్పీ కార్యాలయం ఉండాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు గరివిడిలో నిర్వహించారు. కొద్ది రోజుల క్రితమే చీపురుపల్లిలోని విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వెంకటేశ్వరనగర్‌లోని ఓ అద్దె భవనంలోకి మార్చారు. ఇక నుంచి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఎనిమిది మండలాల పౌరులు, పోలీస్ సిబ్బంది డీఎస్పీ కార్యాలయం పని నిమిత్తం గరివిడి వెళ్లాల్సిన అవసరం లేదు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయాలన్న గొప్ప ఆశయంతో 2023లో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే విజయనగరం జిల్లాలో చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్లు ఏర్పాటయ్యాయి. రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగానే సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయం, డీఎల్‌డీఓ వంటి కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే అప్పట్లో అధికారులు డీఎస్పీ కార్యాలయాన్ని గరివిడిలో ప్రారంభించారు. ఇంతవరకు అక్కడే కార్యకలాపాలు సాగించారు. ప్రస్తుతం డీఎస్పీ ఎస్.రాఘవులు నేతృత్వంలో కార్యాలయాన్ని చీపురుపల్లి హెడ్‌క్వార్టర్స్‌కు మార్చారు. అద్దె భవనంలో పూర్తిస్థాయిలో సదుపాయాలు లేవు. పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో ఖాళీ స్థలం ఉన్నందున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే డీఎస్పీ కార్యాలయానికి సొంత భవనాలు నిర్మించుకునే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పోలీస్ క్వార్టర్స్, అక్కడి ఖాళీ స్థలాన్ని కొద్ది నెలల క్రితమే జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: మండలంలో బి.వి.చానల్, 13 వంతుల కాలువ కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్‌ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో బి.వి.చానెల్, 13 వంతుల కాలువ పరిధి రైతులతో శనివారం సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ రెండు కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యి శివారు భూములకు సాగునీరు అందడం లేదని కొంతమంది రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి ఆక్రమణలు తొలగించి, రూ.36 లక్షలతో కాలువల్లో పూడికల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కూటమి నాయకులు కోరాడ కృష్ణ, నంబూరి రాజేష్, మక్కువ శ్రీధర్, పి.వి.వి.గోపాలరాజు, బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# తీర్మానించిన పనులను ఎందుకు ఆమోదించరు..?

- సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: పంచాయతీలు ప్రతిపాదన చేసి, తీర్మానం చేసి పనులను ఎందుకు ఆమోదించడం లేదని మండల అధికారులను ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరరావు అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు మాట్లాడుతూ గ్రామసభల్లో 744 పనులకు ప్రతిపాదనలు చేయగా, 163 పనులకు రూ.12.78 లక్షలతో తీర్మానాలు పంపారని, వాటిలో కొన్ని పనులే ఎందుకు మంజూరు చేశారని పీఆర్ జేఈ సత్యనారాయణను ప్రశ్నించారు. రెండోసారి పంపిన 73 పనులకు నిధులు మంజూరైనప్పటికీ, భువన యాప్‌లో నమోదు కాలేదని పనులు చేయవద్దంటున్నారని, మార్చి నెల పూర్తయిపోతున్నా ఇంకా యాప్‌లో పనుల వివరాలు ఎందుకు నమోదు చేయలేదని నిలదీశారు. జేఈ స్పందిస్తూ వీలైనంత త్వరగా యాప్‌లో నమోదు చేస్తామని, పనులు చేసుకోవచ్చని వివరణ ఇచ్చారు. ఉపాధి పనుల విషయంలో తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని కొందరు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏ అధికారి అయినా సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుని పనులు చేయాలన్నారు. ధారపర్తిలో ఉపాధి హామీ పనులు జరగడం లేదని తక్షణం పనులు ప్రారంభించాలని ఏపీఓను ఎమ్మెల్సీ ఆదేశించారు. వైస్ ఎంపీపీలు సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, ఈఓపీఆర్డీ లక్ష్మి, తహసీల్దార్ అరుణకుమారి, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదు



మెరకముడిదాం: సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కూర్మనాథ్, అధికారులు

వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులకు ప్రత్యేక అధికారులు ఆదేశించారు. తాగునీరు, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,వేసవిలో వ్యాధులు తదితర అంశాలపై కొత్తవలస, వేపాడ, మెరకముడిదాం మండల పరిషత్ కార్యాలయాల్లో, గరివిడి తహసీల్దార్ కార్యాలయంలో ఆయా మండలాల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, వివిధ శాఖల మండల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఉపాధి పని ప్రదేశాల్లో వేతనదారులకు నీడ కోసం టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటు ఉంచాలని సంబంధిత శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మెరకముడిదాంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంగి కూర్మనాథ్, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు,ఎంపీడీఓ జి.భాస్కరరావు, కొత్తవలసలో ఆ మండల ప్రత్యేక అధికారి బి.రామానందం, ఎంపీడీఓ ఎస్.రమణయ్య, తహసీల్దార్ బి.నీలకంఠరావు, వేపాడలో ఆ మండల ప్రత్యేక అధికారి పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణ, గరివిడిలో ఆ మండల ప్రత్యేకాధికారి వై.వి.రమణ, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

– కొత్తవలస/వేపాడ/మెరకముడిదాం/చీపురుపల్లిరూరల్(గరివిడి)

# గందరగోళం..



టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల వాగ్వాదంతో గందరగోళంగా మారిన ప్రజావేదిక కార్యక్రమం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31వరకు నిర్వహించిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ నివేదికలపై గరివిడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు.గజపతినగరం క్లస్టర్ ఏపీడీ, సోషల్ ఆడిట్ ప్రిసైడింగ్ అధికారి రమామణి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 9గంటల వరకు గందరగోళంగా సాగింది. మండలంలో 1804 పనులకు రూ. 30,26,46,337 కేటాయించినట్లు ఏపీడీ రమామణి తెలిపారు. బి.జె.పాలెం, శేరీపేట, కోనూరు పంచాయతీల వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం,తోపులాట జరిగింది.ఎస్ఐ బి.లోకేష్ సర్దిచెప్పి వివాదాన్ని సద్దుమణిగించారు. ఏనుగువలస, బి.జె.పాలెం, శేరీపేట,కోనూరు పంచాయతీల్లో ఉపాధిపనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఒక వర్గం...తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మరో వర్గం ఆరోపణలకు దిగడంతో ఈ నాలుగు పంచాయతీల్లో రీ వెరిఫికేషన్ చేసేందుకు ఏపీడీ ఆదేశాలిచ్చారు. మిగతా పంచాయతీలకు సంబంధించి సామాజిక తనిఖీ కార్యక్రమం సాధారణంగా సాగింది. ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం, ఏపీఓ కనకరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు ,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# బాలికలకు విద్య, క్రీడా సామగ్రి పంపిణీ



లక్కవరపుకోట: నాన్హి కాలీ ప్రాజెక్టు వారు అందజేసిన కిట్లతో గొల్జాం హైస్కూల్ విద్యార్థినులు



వేపాడ: బక్కునాయుడుపేట గురుకుల పాఠశాల విద్యార్థినులకు కిట్లు అందజేస్తున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త రూపవతి

లక్కవరపుకోట/వేపాడ: ఎల్.కోట మండలంలోని గొల్జాం ఉన్నత పాఠశాలలో, వేపాడ మండలంలోని బక్కునాయు డుపేట గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు హెచ్‌పీసీఎల్ సహకారంతో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాన్హి కాలీ ప్రాజెక్టు వారు శనివారం విద్య, క్రీడా సామగ్రి కిట్లను అందజేశారు. కిట్లలో బ్యాగ్‌లు, స్పోర్ట్స్ టీషర్టులు, బూట్లు, షాక్సులు, నోట్ పుస్తకాలు, న్యాప్కిన్స్ తదితర సామగ్రి ఉన్నాయి. నాన్హి కాలీ ప్రాజెక్టు వర్కర్లు జి.యామిని, కె.నాగప్రసన్న, జె.గంగాభవాని, హెచ్‌ఎం అశోక్‌రాజు, బాలికల గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ కర్త రూపవతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యు.ఉషారాణి వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో రగడ



సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోటలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సభ్యుల వాదోపవాదాలు, సర్పంచ్, వైస్ సర్పంచ్‌ల పరస్పర ఆరోపణలతో రసాభాసగా మారింది. ఉదయం 11.30 గంటలకు ఆరంభమైన సమావేశంలో ముందుగా గత సమావేశంలో ప్రతిపాదించిన తీర్మానాల అమలుపై సభ్యులు ప్రశ్నించారు. గతంలో ప్రతిపాదించిన పనులకు నిధులు లేక మంజూరు చేయలేక పోయామని ఈఓ అనూరాధ బదులివ్వడంతో సభ్యులు విరుచుకుపడ్డారు. తాము వార్డు సభ్యులుగా ఉండి దేనికని, ఒక్క పని చేయించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మీకు నచ్చిన చోట పనులు చేయడానికి నిధులు ఉంటాయి కానీ మేము ప్రతిపాదన చేసిన పనులకు సొమ్ములు ఉండవు ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. గత పాలకవర్గాల్లో ఎప్పుడూ ఈతరహా అన్యాయం లేదంటూ స్వపక్ష, విపక్ష వార్డు సభ్యులు ధ్వజమెత్తారు. ముందుగా అజెండాలో 145వ అంశంగా ప్రతిపాదించిన 32 పనులు, 146వ అంశమైన 27 కరెంటు స్తంభాల అంశాలను వ్యతిరేకిస్తున్నామని, వాటిని పూర్తిగా నిలిపేయాలని కోరారు. ఇంటిపన్ను వసూళ్లు, జనన మరణాలు, టెండర్ల ప్రతిపాదనలు ఆమోదిస్తున్నట్లు చెప్పారు.

**అభివద్ధిని అడ్డుకున్నదెవరు...?**

ఏనాడూ సజావుగా సమావేశాలు జరగనివ్వరు. చేసిన పనులను అడ్డుకుంటారు. అభివృద్ధి ఎలా జరుగుతుందని సర్పంచ్ సంతోషికుమారి వైస్‌సర్పంచ్ కుమార్‌పై ఆరోపణలు చేయగా, వైస్ సర్పంచ్ కుమార్ నాలుగేళ్ల అజెండాల కాపీలను తెచ్చి టేబుల్‌పై పడేసి ప్రతిపాదించిన పనుల్లో కుప్పకోనేరు,ప్రకాశం మార్కెట్, ఓల్డ్ బస్టాండ్, రైతు బజార్ వద్ద దుకాణాల నిర్మాణం, సత్యసాయి ట్రస్టు బస్‌షెల్టర్, గాంధీపార్కుల అభివృద్ధి ఎందుకు చేయలేదు, ఎవరు అడ్డుకున్నారు మీరా..మేమా అని వైస్ సర్పంచ్ ప్రశ్నించారు. మూడేళ్లుగా తీసిన గెడ్డలోనే పూడికలు తీస్తూ లక్షలు బిల్లులు స్వాహా చేయడం నిజం కాదా, ప్రైవేటు లేఅవుట్లలో వర్క్‌లు ప్రతిపాదించి వాళ్లనుంచి సొమ్ములు దండుకోవడం నిజం కాదా అంటూ ధ్వజమెత్తారు. చివరిగా సభ్యుల కోరిక మేరకు ప్రతిపాదిత పనులు ఆపేసి ప్రతి వార్డు సభునికి రూ.1.50లక్షల విలువ చేసే పనులు ప్రతిపాదించాలని చెప్పి సమావేశాన్ని ముగించారు.

# వైభవంగా నూకాలమ్మ పండగ



లక్కవరపుకోట: మల్లివీడులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కొత్తవలస: మంగళపాలెంలో అరటి పండ్లతో నూకాలమ్మవారికి అలంకరణ



వేపాడ: బొద్దాంలో అమ్మవారి ఆలయానికి ప్రభలతో ఊరేగింపుగా వచ్చిన భక్తులు



శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

కొత్త అమావాస్య సందర్భంగా ఎస్.కోట, వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాల్లోని పలుగ్రామాల్లో, ఎస్.కోట పట్ట ణంలో నూకాలమ్మ పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు, భక్తులు అమ్మవార్ల ఆలయాలకు డప్పులు, భాజా భజంత్రీలు ప్రభలతో ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మ వారికి పసుపు, కుంకుమ,చీరలు,సారె, గాజులు, పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్.కోట పట్టణంలో నూకాంబికా అమ్మవారి ఆలయంతో పాటు పలు అమ్మవార్ల ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద వాలీబాల్ పోటీలు, ఎడ్ల పరుగు పందాలు నిర్వ హించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ షో, సత్యహరిశ్చంద్ర నాటకం, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.వేపాడ, వల్లంపూడి, బక్కునాయుడుపేట గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– శృంగవరపుకోట/వేపాడ/లక్కవరపుకోట/కొత్తవలస